'స్వాతి' మంత్లీలో ప్రచురితమైన నవల

# ఆత్రం పెళ్ళికొడుకు

## బి.గీతిక



# ఆత్రం పెళ్ళికొడుకు

ఉదయం పది గంటలవుతోంది సమయం.

విజయవాడ సిటీ మెయిన్ రోడ్స్‌లో కొంచెంకొంచెంగా రద్దీ పెరుగుతోంది.

మెయిన్ రోడ్స్‌ని కలిపే కార్నర్‌లో.. "శ్రీ ఘంటశాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల" అని ఉన్న పెద్ద బోర్డూ, ఆ బోర్డు కింద వెడల్పైన మెయిన్‌గేటూ.. ఆ దారిన వెళ్ళే కళాపిపాసకుల్ని ఆకర్షిస్తున్నట్లుగా ఉన్నాయి.

రెడ్ సిగ్నల్ పడడంతో వరుసగా ఆగి పేరుకుంటున్నాయి రకరకాల కారులు. వాటి మధ్యల్లో చిక్కకుండా తన పల్సర్‌ని తప్పిస్తూ, రయ్‌రయ్యిన దూసుకుంటూ కళాశాల ప్రాంగణంలోకి వచ్చాడు మనోజ్. ఆడిటోరియం దగ్గరకి వస్తూనే సడెన్ బ్రేక్ వెయ్యడంతో బైక్ ఒక్కసారిగా కీచుమని శబ్దం చేస్తూ సర్రున ఆగింది.

బైక్ వచ్చిన వేగం, ఆ వేగానికి హఠాత్తుగా ఆనకట్టని వేయడం,.. మనోజ్‌లోని మానసిక అస్థిమితాన్ని సూచిస్తున్నాయి.

'సుధీర్ లేకుండా తాను పెళ్ళి చేసుకోవాలి..!' అన్నదాన్ని ఊహించడానికే చాలా ఇరిటేటింగ్‌గా ఫీలవుతున్నాడు మనోజ్. అతనికిది చాలా క్లిష్టమైన సమస్యలా ఉంది. బండి సైడ్‌స్టాండ్ వేస్తూ, సుధీర్ కోసం గబగబా అటూఇటూ చూశాడు.

దూరంగా పచ్చికలో పచార్లు చేస్తూ సెల్‌ఫోన్లో మాట్లాడుతున్న సుధీర్ అతని కళ్ళబడ్డాడు. అంతే వెంటనే, "అరేయ్ సుధీ.. సుధీర్.." అని గట్టిగా పిలుస్తూ అటు వైపు పరిగెత్తాడు.

ఆ ప్రాంగణంలోని నేల మీద కాస్తోకూస్తో పెరిగున్న పచ్చగడ్డిని పెరుక్కు తింటున్న ఆవుదూడలు.. మనోజ్ అరిచిన అరుపుకి అదిరిపాటుగా తలలు తిప్పి చూశాయి. కానీ, ఫోన్లో మాట్లాడుతున్న సుధీర్‌కి మాత్రం మనోజ్ కేకలు అస్సలు వినిపించలేదు.

అతను ఫోన్ మాట్లాడడం పూర్తి చేసి ఇటు తిరిగే సరికి, "సుధీర్.." అని పిలుస్తూ, ఆయాసపడుతూ తన దగ్గరకొచ్చిన మనోజ్ కనిపించాడతనికి.

హఠాత్తుగా ప్రత్యక్షమైన మనోజ్‌ని చూసి ఉలిక్కిపడి, అంతలోనే మిత్రుడిని చూసిన ఆనందంతో, "హాయ్..రా.. ఏంటి ఇక్కడకొచ్చావ్..?" అని ఆశ్చర్యంగా అడిగాడు సుధీర్.

మనోజ్ ఆయాసంతో శ్వాస వేగంగా తీసుకుంటూ, "మీరు.. వారణాసికి.. బయల్దేరేది ఈ రాత్రికేనా..?" అని కంగారుగా అడిగాడు.

అతని వంక సందేహంగా చూస్తూ, "అవును. అయినా కొత్తగా అడుగుతున్నావేంటీ.. రెండు నెలల క్రితం ట్రైన్ టిక్కెట్స్ బుక్ చేస్తున్నప్పుడే నీతో చెప్పానుగా.." అన్నాడు సుధీర్.

"అప్పుడు చెప్పావులేరా.. డేటు పర్టిక్యులర్‌గా గుర్తులేదు. ఇప్పుడు మీ ఇంటికి వెళితే, రాత్రికే ప్రయాణం అని చెప్పారు. నీ గురించి అడిగితే ఈ కాలేజ్‌కి వచ్చావన్నారు. చచ్చే టెన్షన్‌తో ఇక్కడకొచ్చా.." అంటూ ఆయాసం తీర్చుకోవడానికి ఒక్క సెకను ఆగాడు మనోజ్.

మనోజ్ ఆదుర్దా ఎందుకో అర్థంకాలేదు సుధీర్‌కి. "రేయ్.. నీ కంగారేంట్రా అసలు..? ఈ రాత్రికి మేము వారణాసి వెళుతుంటే నీకెందుకురా టెన్షన్..?" అని అయోమయంగా అడిగాడు.

"అదే చెప్పబోతున్నాన్రా నీకు సుందర్రామరాజంకుల్ తెలుసు కదా... వాళ్ళ అమ్మాయితో నాకు మ్యారేజ్ ఫిక్స్ అయ్యిందిరా.." అన్నాడు మనోజ్.

"సుందర్రామరాజంకుల్ కూతురుతోనా.. అంటే.. అత్రిజ.. అత్రిజతోనా..! నువ్వా.. నువ్వు తనతో పెళ్ళికి ఒప్పేసుకున్నావా..!?" అని షాకై అడిగాడు సుధీర్.

"ఊ.. ఒప్పుకున్నానురా. నువ్వెందుకు అంత ఆశ్చర్యపోతున్నావ్..?" అంటూ అనుమానంగా చూశాడు మనోజ్.

తన ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకుంటూ, "ఊహుహు. ఏం లేదురా. మ్యారేజ్ ఫిక్స్ అయ్యిందన్నావ్ కదా, కొంచెం షాక్ అంతే. అదిసరే, ఇంత గుడ్‌న్యూస్ చెప్పడానికి టెన్షనెందుకురా.." నవ్వుతూ అన్నాడు సుధీర్.

సుధీర్ నవ్వు ముఖాన్ని చూసి నొసలు చిట్లించి, "ఏహె.. నే చెప్పేది పూర్తిగా వినరా. మ్యారేజ్ సెట్టయ్యింది అన్నాను కదా. అదెప్పుడో తెలుసా..?" అంటూ బిక్కమొహం వేశాడు మనోజ్.

"ఎప్పుడ్రా.." అని ఇంకా గట్టిగా నవ్వుతూ అడిగాడు సుధీర్.

"ఎప్పుడా.. వచ్చే ఆదివారమే.." అని చెప్పాడు మనోజ్.

"వచ్చే ఆదివారమా.." అంటూ ఖంగుతిన్నాడు సుధీర్.

"అవున్రా. సండేనేరా నా పెళ్ళి. రేపే నన్ను పెళ్ళికొడుకుని చేస్తారట. పెళ్ళికొడుకుని చేశాక ఇంట్లోంచి బయటికే వెళ్ళకూడదంటున్నార్రా మావాళ్ళు.." అని నీరసంగా అన్నాడు మనోజ్.

ఆ మాటలు వినగానే, "ఒమైగాడ్..! ఆదివారమే పెళ్ళా..!! రేపు పెళ్ళికొడుకుని చేస్తున్నారా..! మరి ఈ రాత్రికే కదరా మేం వారణాసి బయల్దేరుతున్నాం..." అన్నాడు సుధీర్.

"అదే కదరా నా కంగారు. అయిదు రోజులు.. రోజు పెళ్ళికొడుకుని చేస్తారంట. ఆరోరోజు పెళ్ళి. నువ్వు టూర్ నుంచి వచ్చేసరికి అం..తా అయిపోతుందిరా. నా పెళ్ళిలో నువ్వు లేకపోతే ఎలారా సుధీర్..?" అని మళ్ళీ బిక్కమొహం పెట్టాడు మనోజ్.

మనోజ్ మాటలు కలిగించిన షాక్ నుంచి తేరుకుంటూ, "మరి ఇన్ని రోజులూ చెప్పకుండా ఏం చేశావురా. పెద్ద ఇప్పుడొచ్చి చెబుతున్నావ్.." అని కోపంగా అడిగాడు సుధీర్.

"ఇన్ని రోజులూ ఏంట్రా..! అమ్మాయిని చూసిందే నిన్నయితే. నిన్న సాయంత్రం సుందర్రామరాజంకుల్ వాళ్ళ అమ్మాయిని మనింటికి తీసుకురావడం.. తను బామ్మకీ, అన్నయ్యకీ, వదినకీ బాగా నచ్చడం.. పంతులుగారు జాతకాలు చూసి, ముహూర్తాలు పెట్టడం.. అన్నీ అవన్నీ పూర్తయ్యేసరికి రాత్రి చాలా ఆలశ్యమైంది. పొద్దుటి నుంచీ నీకు ఫోన్ చేస్తూనే ఉన్నాను. అదేమో ఎప్పుడు ఫోన్ చేసినా కుయ్‌కుయ్ అంటుందితప్ప కలవదూ సావదు. నాకేమో టెన్షన్.. ఈ ఆదివారమే నా పెళ్ళి. నా బెస్ట్ ఫ్రెండ్‌వి, నువ్వు లేకుండా నేను పెళ్ళెలా చేసుకుంటాను. నువ్వు తప్పకుండా టూర్ ఆగిపోవాలిరా.." అని కరాఖండిగా చెప్పాడు మనోజ్.

సుధీర్ ఆలోచనలో పడుతూ, "మా ఇంటికి వెళ్ళావుగా. మరి నీ పెళ్ళి విషయం మా డాడీతో చెప్పావా.."

అనడిగాడు.

"నేను వెళ్ళేసరికి.. ఏదో చెయ్యలేదంటూ ఆంటీని కేకలేస్తున్నారు మీ డాడీ. ఆయన మొహం చూసేసరికి తనూష విషయంలో నాకిచ్చిన కోటింగ్ గుర్తొచ్చింది. అంతే.. భయమేసి చెప్పలేదురా.." అన్నాడు మనోజ్.

ఇప్పుడు ఇంటికి వెళ్ళి 'వారణాసికి రాను..' అని చెబితే తన తండ్రి ఎలా రియాక్ట్ అవుతాడో సుధీర్‌కి బాగా తెలుసు. అందుకే.. వెంటనే ఏం చెయ్యాలో తెలీక మనోజ్ వంక కోపంగా చూస్తూ, "నీ అయ్య..! అటూ ఇటూ కాకుండా ఇలా ముంచేశావేంట్రా..!" అంటూ తల పట్టుకున్నాడు సుధీర్.

"రేయ్ ప్లీజ్‌రా సుధీ. ఏదో ఒకటి చేసి టూర్‌కి వెళ్ళకుండా ఆగిపోరా. నువ్వు నా పక్కనుంటే చాలా ధైర్యంగా ఉంటుందిరా. ప్లీజ్‌రా.." అని సుధీర్ చేతులు పట్టుకుని బతిమిలాడాడు మనోజ్.

అతని చేతుల్లోంచి విసురుగా తన చేతుల్ని లాక్కుని, "ఈ విషయం నిన్న ముహూర్తాలు పెట్టుకుంటున్నప్పుడు తెలీలేదా..?" అన్నాడు సుధీర్.

"తెలుసురా. కానీ నేను టైం కావాలని గొంతు చించుకుని చెబుతున్నా, మా ముసల్ది వింటేనా. రెండు నెలల తర్వాత ముహూర్తం ఉన్నా కూడా ఈ ముహూర్తమే చాలా బలమైందని ఖాయం చేయించేసిందిరా.." అని బామ్మ మీద కోపాన్నంతా ముసల్ది అని తిట్టడంలో చూపించాడు మనోజ్.

"రెణ్నెల్ల తర్వాత ముహూర్తం ఉందా..! పాతిక సంబంధాలు కాదన్నప్పుడు నీ మాట వింది కదా. అలాగే ఈ ముహూర్తం విషయంలోనూ గట్టిగా పట్టుబట్టాల్సింది.." అన్నాడు సుధీర్.

"పట్టుపట్టితే వింటుందా..! నీకు దాని గురించి మొత్తం తెలుసు కదా. ఇప్పటికే నా పెళ్ళి చూసి పైకి పోతానంటూ ముప్పై సంబంధాలు చూసింది. వాటన్నిటినీ కాదన్నట్టే మళ్ళీ మధ్యలో మనసు మార్చుకుని దీన్నీ ఎక్కడ వద్దంటానోనని, ఈ ఆదివారం ముహూర్తమే చాలా బలమైందని ఇలా బుక్ చేసేసిందిరా.." అని పళ్ళు నూరుతూ చెప్పాడు మనోజ్.

"సర్లే అన్నీ అయిపోయాక మనమేం చేస్తాం. ఈ సారికి నన్ను వదిలెయ్.." అని నిర్లక్ష్యంగా పక్కకు తిరిగాడు సుధీర్.

"ఈ సారికి వదిలెయ్యడమేంట్రా..! నేనేమన్నా మళ్ళోసారి పెళ్ళి చేసుకుంటానా..?" అంటూ సుధీర్ భుజాన్ని పట్టుకుని గట్టిగా తన వైపు తిప్పుకున్నాడు మనోజ్.

"మరేం చెయ్యనురా. నేను కాశీకి రాను అని చెప్తే మా నాన్న నా కాళ్ళూ, చేతులూ కట్టేసి మరీ తీసుకెళతాడు. ఎట్టి పరిస్థితిలోనూ శివరాత్రి రోజున మా ఫ్యామిలీ అంతా కాశీలో గడపాలని ఆయన కోరిక. ఆర్ట్స్ గ్యాలరీ పెట్టడం కోసం కళాక్షేత్రం బుక్ చేసుకున్నానని చెప్పినా వినలేదు. నీకూ చెప్పానుగా. ఇప్పుడు ఆ అడ్వాన్స్ డబ్బు గురించే ఫోన్.. లాక్కునీ పీక్కోలేక ఛస్తున్నాను. అందుకే నేను లేకపోయినా పర్లేదుగానీ, నువ్వు లాగించెయ్. కావాలంటే నీ పెళ్ళి వీడియో చూసి, పెళ్ళిని చూసినట్టు ఫీలవుతాలే.." అని మనోజ్‌కి సర్దిచెప్తున్నట్టుగా అన్నాడు సుధీర్.

"నాకు తెలుసులేరా సుధీ. నీ లవ్ మ్యాటర్‌ని సక్సెస్ చెయ్యలేదని, ఆ కుళ్ళు ఇప్పుడిలా నా పెళ్ళి విషయంలో తీర్చుకుంటున్నావ్ కదా.." అని ఆఖరి బాణం వదిలాడు మనోజ్.

"రేయ్ నీ అయ్య.. బుద్ధుండే మాట్లాడుతున్నావా..? తనూష విషయంలో నువ్వు చేసింది ఎప్పుడో మర్చిపోయాను. పాతవన్నీ తోడకిప్పుడు. ఐనా.. నువ్వు సుందర్రామ రాజంకుల్‌తో కాంటాక్ట్‌లోనే ఉంటావ్‌గా. వాళ్ళమ్మాయి అత్రిజని ఎప్పుడూ చూడలేదా..? మరిప్పుడు సడెన్‌గా ఈ పెళ్ళిచూపులేంటీ..?" కసురుతూ అడిగాడు

సుధీర్.

"అంకుల్‌కో అమ్మాయి ఉందని తెలుసుగానీ, నేనెప్పుడూ తనని చూడలేదురా. మొన్న అంకుల్ మా ఇంటికి వచ్చినప్పుడు, బామ్మ నా పెళ్ళి గురించి ఓ.. ఇదయిపోతూ చరిత్రంతా చెప్పగానే.. అంకులేమో.. మా అమ్మాయిని తీసుకొస్తాను, నచ్చితే ఓకే చేసుకుందాం అన్నారు. ఇదిలా ఫిక్సైపోతుందనుకోలేదురా. ఫిక్సైనా ముహూర్తం ఇంత దగ్గర్లో వస్తుందని అస్సలు అనుకోలేదురా.." అని ఇంకా ఏదో చెప్పబోయాడు మనోజ్.

"ఏంటీ..! అత్రిజ అంత బాగా నచ్చేసిందా..?" అని అదోలా చూస్తూ అడిగాడు సుధీర్.

"అంతేం లేదురా. యావరేజే. కానీ, కాదంటే అంకుల్ ఫీలవుతారేమో అనిపించింది. సర్లే నాకు ఇంతే రాసిపెట్టుందని ఓకే అన్నాను. మీ కాశీ టూర్ సంగతి నాకు గుర్తు లేదురా. గుర్తుంటే మా ముసల్దాని దుంప తెంచైనా ఈ ముహూర్తానికి ఒప్పుకునే వాణ్ని కాను. రేయ్ ఎలాగైనా నా పెళ్ళిలో నువ్వు ఉండాల్రా. నా పక్కన నువ్వుంటేనే.. నేనంటే నీకు ప్రాణం అని నమ్ముతాన్రా లేకపోతే లేదు.." అంటూ పంతం పడుతున్నట్టుగా అన్నాడు మనోజ్.

"ఏంట్రా.. నేనేదో కావాలనే నీ పెళ్ళికి ఉండట్లేదన్నట్టు మాట్లాడుతున్నావ్. చెయ్యాల్సిందంతా నువ్వు చేసేసి, రాత్రికి టూర్ వెళ్ళబోతుంటే ఇప్పుడొచ్చి, వారంరోజుల్లో నీ పెళ్ళంటావా..! నీకసలు.." అంటున్న సుధీర్ మాటలు ఇంకా పూర్తికాలేదు.

"అరెరెరెయ్ ప్లీజ్‌రా. అంకుల్‌తో ఏదో ఒకటి చెప్పి ఎలాగైనా మ్యానేజ్ చెయ్యరా. నువ్వుంటే కొంచెం సరదాగా, టెన్షన్ ఫ్రీగా ఉంటుంది.." అని బ్రతిమిలాడాడు మనోజ్.

"అదా సంగతి.. నేను లేకపోతే నన్ను మిస్సవుతావని కాదన్నమాట.." అన్నాడు సుధీర్.

వెంటనే మనోజ్ నాలుక్కరుచుకుని, "అదే ఇదిరా. నీవల్ల టెన్షన్ ఫ్రీ అంటే.. నువ్వు లేకపోతే, నిన్ను మిస్సయినట్టే కదరా.." అని గజిబిజిగా చెప్పాడు మనోజ్.

"సర్లే. నా బుర్ర తినకు. ఇంటికి వెళ్ళగానే, డాడీకి చెప్పి చూస్తాను." అన్నాడు సుధీర్.

అంతే.. ఆ మాటలు వినగానే హుషారుగా, "ఓహ్. సరే థ్యాంక్స్‌రా.." అని సుధీర్ చెయ్యి పట్టుకుని ఊపేస్తూ ఆనందంగా అన్నాడు మనోజ్.

"అప్పుడే కన్‌ఫాం అయిపోయినట్టు ఫిక్సైపోమాకు. ట్రై చేస్తాను. సక్సెస్ కాకపోతే.. నువ్వొక్కడివే పెళ్ళి చేసుకో.." అన్నాడు సుధీర్.

"ఆ.. ఒక్కడినేనా..! అంటే..." అని సందిగ్ధంగా చూశాడు మనోజ్.

"అదేరా.. నేను పక్కన ఉండకపోయినా నువ్వు ఒక్కడివే కూర్చుని చేసుకో.. అంటున్నా.." అంటూ వివరంగా చెప్పాడు.

"అంతొద్దులే, నువ్వు ఏదో ఒకటి చేసి మీ డాడీని మ్యానేజ్ చేయ్యగలవని నాకు నమ్మకముంది. ఓకే బై. నేనింకా చాలా పనులు చేయాలి. షాపింగ్ కూడా ఇప్పుడే ఫినిష్ చేసేయాలి. మళ్ళీ రేపు పెళ్ళికొడుకుని చేశాక బయటకు రానివ్వరట.." అంటూ గబగబా బైక్ దగ్గరకు నడిచాడు మనోజ్.

"బయటకి రానివ్వరా..! ఇంకా ఈ పాతకాలపు ఆచారాలేంట్రా నాయనా.." అని నవ్వుతూ అన్నాడు మనోజ్ వెనకాలే వచ్చిన సుధీర్.

మనోజ్ చిన్నగా నుదురు చరుచుకుంటూ, "ఏం చెబుతాం రా. మా ఇంట్లో ఆ ముసల్దాని పెత్తనం. అది ఆడమంటే ఆడాలి. పాడమంటే పాడాలి. దాని చాదస్తపు మాటల్తో ఇంట్లో హ్యూమర్ లేకుండా పోయింది. అందుకే..

ఆ హ్యూమర్ కోసమైనా నువ్వు నా పెళ్ళిలో, నా పక్కనే ఉండాల్రా. ఓకే.ఓకే. అలా చూడకు. ట్రై చెయ్యి. అడ్వాన్స్డ్ థ్యాంక్స్‌రా. బైబై.." అంటూ బండి స్టార్ట్ చేసి ముందుకు దూకించాడు మనోజ్.

ఇంతసేపు ఆ ప్రాంగణంలో ఉన్న మనోజ్.. ఇంకొక్క రెండు నిముషాలు అక్కడే ఉండుంటే.. ఈ ముహూర్తమే కాదు, అసలు నాకీ పెళ్ళే వద్దని వాళ్ళ బామ్మతో తప్పకుండా చెప్పేసేవాడు..!

సంగీత కళాశాల ఆవరణలో నుంచి సర్రున దూసుకెళుతున్న మనోజ్ బైక్‌ని చూస్తూ, ఆలోచనలో పడిన సుధీర్, "అన్నయ్యా.. .." అని గట్టిగా వినిపించిన పిలుపుకి ఉలిక్కిపడి తల తిప్పి చూశాడు.

అప్పటికే రెండు మూడుసార్లు పిలిచినా, అలవాటు లేని ఆ పిలుపు వల్ల సుధీర్ వెంటనే స్పందించలేదని అర్థమైందామెకు. అతన్ని చూస్తూ, "వచ్చిన పని అయిపోయింది. ఇంటికి వెళదామా.." అని అడిగింది పూజిత.

అలాగేనన్నట్టు తలూపి, కొత్త చెల్లెలిని ఒకసారి తనివితీరా చూసి బైక్ వైపు కదిలాడు సుధీర్.

సంగీత క్లాసు ముగిసి, తరగతి గదుల్లో నుంచి బయటకు వస్తున్న ఆడపిల్లలతో కళకళలాడుతోంది ఆ ప్రాంగణం.

సుధీర్ వెంట నడుస్తూ, "అన్నయ్యా.. రాత్రికి మా ఫ్రెండ్స్ అందరూ నాకు సెండాఫ్ ఇవ్వడానికి ఇంటికి వస్తామంటున్నారు. వాళ్ళకి మీ ఇంటి అడ్రస్ ఇచ్చాను. పర్వాలేదు కదా.." అనడిగింది పూజిత.

ఆమె మాటలు అర్థమయ్యీ కానట్టనిపించాయి సుధీర్‌కి. కనుబొమ్మలు ముడిచి, "పర్లేదూ. కానీ, సెండాఫ్ ఇవ్వడానికైతే రైల్వే స్టేషనుకు రావచ్చుగా. రాత్రి మనం బయల్దేరే ముందంటే.. ఇల్లంతా కొంచెం గందరగోళంగా ఉంటుందేమో కదా..." అన్నాడు.

"గంగాకావేరి ట్రైన్ లేట్‌నైట్ కదా. రైల్వేస్టేషన్‌కి రాలేరట. ఇంటి దగ్గరకైతే అందరూ వస్తామన్నారు. కలిసి కొంచెం సేపు మాట్లాడుకోవచ్చనీ.." అంది పూజిత.

ఆమె మాటలకి ఆశ్చర్యపోతూ, "మాట్లాడుకోవడానికా..! ఏ..? టూర్ నుంచి వచ్చిన తర్వాత మాట్లాడుకోకూడదా..? ప్రయాణమయ్యే ముందు తాపీగా మాటలేంటి.." అనడిగాడు సుధీర్.

"మాకు రేపట్నుంచీ ఫైనల్ ఎగ్జామ్స్. మనం టూర్ నుంచి వచ్చేసరికి పది రోజులు పడుతుంది. అప్పటికి ఎగ్జామ్స్ అయిపోతాయి. ఇది ఫైనల్ ఇయర్.. పరీక్షలు అయిపోతే ఇక రోజూ ఇలా కలుసుకోం కదా.." అని చెప్పింది పూజిత.

నమ్మలేనట్టు షాకై నిలుచుండిపోయాడు సుధీర్. కళ్ళు పెద్దవి చేసి ఆమె వంక వింతగా చూస్తూ, "ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ పెట్టుకుని కాశీకి వస్తున్నావా..! మరి ఈ ఎగ్జామ్స్ వ్రాయకపోతే, ఇయర్ మొత్తం వేస్ట్ అయిపోదూ.." అని ఆశ్చర్యంగా అడిగాడు.

"వేస్టే మరి. నాన్నని చాలా చాలా రిక్వెస్ట్ చేశాను. ఒప్పుకోలేదు. మీ ఫ్యామిలీ, మా ఫ్యామిలీ ఇరవై ఏళ్ళ తర్వాత కలిశాం కదా. మీ నాన్న మొదటిసారి ఫోన్ చేసినప్పుడే, అందరం కలిసి కాశీకి వెళితే బాగుంటుందని మా నాన్నతో అన్నారు. పెదనాన్న ఏం చెప్పినా మీ ఇష్టం మీ ఇష్టం అనేశారు నాన్న. నా పరీక్షలు ఇప్పుడుండొచ్చని చెప్పినా వినలేదు. ఈ సంవత్సరం కాకపోతే వచ్చే సంవత్సరం వ్రాద్దువులే, మీ అమ్మ చనిపోయినప్పుడు విడిపోయాం. అపార్థాలన్నీ తొలగి ఇప్పటికి కలిశాం, నువ్వింకేం మాట్లాడకు.. అని మందలించారు నాన్న.." అంటూ నిరుత్సాహంగా చెప్పింది పూజిత.

పూజిత చెప్పేది వింటూనే సుధీర్ బుర్రలో ఏవేవో ఆలోచనలు గిరగిరా గింగిరాలు తిరుగుతున్నాయి. మనోజ్ పెళ్ళికోసం, తన ఆర్ట్స్ గ్యాలరీ కోసం,.. కాశీ ప్రయాణాన్ని ఎలా తప్పించుకోవాలా అని ఆలోచిస్తున్న

సుధీర్‌కి దారి దొరికినట్టనిపించింది.

సుధీర్‌కి తెలుసు.. అతని తండ్రి భాస్కర్రావు చదువుకీ, పరీక్షకీ ఎంత విలువిస్తాడో. అంతే.. సుధీర్ పెదవులపై సన్నని నవ్వు కదలాడిరది. ఆ నవ్వు.. పక్కవాడి అవసరాన్ని మన అవసరానికి వాడుకుంటున్నప్పుడు వచ్చే ఒక విచిత్రమైన నవ్వు.

పరీక్షలు వ్రాయలేక పోతున్నందుకు తాను బాధపడుతుంటే, పిచ్చివాడిలా నవ్వుతున్నాడేంటీ.. అనుకుంటూ చిత్రంగా సుధీర్ వంక చూసింది పూజిత.

ఒక్క దెబ్బకి మూడు పిట్టలు. ఈ వంకతో టూర్‌కి వెళ్ళకుండా ఆగిపోయి, ఫ్రెండ్సందరితో పదిరోజులు జాలీగా గడిపెయ్యొచ్చు.. మనోజ్ పెళ్ళితో పాటూ నా ఆర్ట్స్ గ్యాలరీ పని కూడా చూసుకోవచ్చు.. అని ఊహించుకుంటూ గాలిలో తేలిపోయాడు సుధీర్. పూజిత చూపుల్ని పట్టించుకోకుండా బైక్ స్టార్ట్ చేసి, "ఎక్కు.." అన్నాడు.

బైక్ ఎక్కి కూర్చుని, సుధీర్ వంక చిత్రవిచిత్రంగా చూస్తూనే ఉంది పూజిత.

ఉత్సాహంగా బండిని ముందుకి దూకించాడు సుధీర్.

* * *

కళానికేతన్ షాపింగ్ మాల్..!

ఆ షాపింగ్ మాల్ మొత్తాన్నీ మంచులో ముంచి తీసినట్టు చల్లగా ఉంది. ఆగకుండా పనిచేస్తున్న ఏసి వల్ల మిట్టమధ్యాహ్న వేళలోనూ లోపలంతా చల్లగాలి పరుచుకుని ఉంది.

దూరంగా జంట్స్ కలెక్షన్‌లో బట్టల గుట్టముందు నిలబడున్న మనోజ్ కనిపించగానే, "హాయ్ మనోజ్..." అని పిలుస్తూ వేగంగా అతని వైపు అడుగులేసింది అత్రిజ.

అత్రిజని చూడగానే ఆశ్చర్యపోతూ, "హాయ్.." అని బదులు పకరించాడు మనోజ్. ఆమె వెనుకగా చూస్తూ, "అంకుల్ రాలేదా..?" అని సందేహంగా అడిగాడు.

"ఊహు. మన పెళ్ళిపనుల్లో డాడీ చాలా బిజీగా ఉన్నారు. నేను నీకోసం ఫోన్ చేస్తే, నువ్వు ఇక్కడ ఉన్నావని మీ వదిన చెప్పింది. నీ సెలెక్షన్స్ ఎలా ఉంటాయో చూద్దామని వచ్చాను.." అని నవ్వుతూ అంది అత్రిజ.

ఆమె అలా అనేసరికి, తాను వచ్చి అర్ధగంటైనా ఇంకా ఏమీ సెలెక్ట్ చెయ్యలేదని చెప్పడానికి సిగ్గు పడ్డాడు మనోజ్. దానిని కవర్ చేసుకోవడానికి, "నా సెలెక్షన్ చూడ్డం కాదుగానీ, నీ సెలెక్షన్ ఎలా ఉంటుందో నేను చూస్తానిప్పుడు.." అంటూ గుట్టగా ఉన్న బట్టల వంక కళ్ళతో చూపించాడు.

"యూ క్రేజీ.." అంటూ బట్టల వైపు చూసింది అత్రిజ.

"ఆల్రెడీ వెడ్డింగ్ వేర్ వాళ్ళు తీసుకుంటున్నారు. జస్ట్ డైలీ వేర్ కోసం ఇటు వచ్చాను.." అన్నాడు మనోజ్.

అతని మాటకి తలని చిన్నగా ఆడిస్తూ, అక్కడ ఉన్న జీన్స్ ప్యాంట్లనీ, షర్ట్సనీ కళ్ళతోనే పైపైన గమనించి చూసి.. అవేమీ నచ్చనట్టుగా తలని రాక్స్ వైపు తిప్పింది అత్రిజ. వాటిల్లో ఆమెకి నచ్చిన కలర్ కనిపించగానే, సేల్స్‌బోయ్‌కి వేలితో ఆ రాక్ వంక చూపించిందామె.

ఆమెనే చూస్తున్న మనోజ్ ఆ డ్రెస్ కలర్ ఏంటా అని ఆసక్తిగా అటు చూశాడు. అంతే.. అతని కనుబొమ్మలు ముడిపడ్డాయి. లైట్ బ్రౌన్ కలర్ జీన్స్ ప్యాంట్స్ ఉన్న రాక్ అది..!

బోయ్ తెచ్చిన ఓ జీన్స్ ని చేత్తో పట్టుకుని మనోజ్ వంకా, జీన్ వంకా రెండుసార్లు అటూఇటూ చూసి

సంతృప్తి పడి.. ఎలా ఉందన్నట్టుగా అతని ముఖంలోకి చూసింది అత్రిజ.

మొహమాటంతో చిన్నగా తలాడిస్తూ, "కొంచెం డార్క్ బ్రౌన్ అయితే బాగుంటుందేమో.." అన్నాడు మనోజ్.

అత్రిజ అతని చెవిలో పెదాలు దూర్చి, "నో మనోజ్. నువ్వు చామనఛాయ కదా. నీకు లైట్ కలర్సే బావుంటాయి. ఇంకా డార్క్ అయితే నువ్వు బ్లాక్‌బోయ్‌లా కనిపిస్తావ్. అయినా మన పెళ్ళయ్యాక నాకు నచ్చిన కలర్సే వేసుకోవాలి. నే చెప్తున్నాగా. ఇది నీకు బాగా సూట్ అవుతుంది. దీని మీదకి లైట్ కలర్ షర్ట్స్ ఏవి వేసినా బావుంటాయి. ఊ.. ఇంకా స్కై బ్లూ, యాష్ కలర్ జీన్స్‌లూ తీసుకుందాం. తర్వాత షర్ట్స్ చూద్దాం. సరేనా.." అని గబగబా అంది.

లైట్ కలర్స్‌లోనే తాను ఇంకా నల్లగా కనిపిస్తానని బలంగా అనిపిస్తుంటే, ఆమె మాటలకి మొహమాటంగా తలాడించాడు మనోజ్.

బిడియపడుతూ దూరం దూరంగా ఉంటున్న మనోజ్‌కి దగ్గరగా వచ్చి, అతని చేతిని చనువుగా పట్టుకుంది అత్రిజ.

సుధీర్ చెప్పింది వినగానే, "కాశీకి రావా..???" అని భూమి కంపించేంత గట్టిగా అరిచాడు సుధీర్ తండ్రి భాస్కర్రావ్.

ఆయన కేకకి ఉలిక్కిపడింది పూజిత. తన తండ్రితో పరీక్షలని చెప్పినా, ఆయన వాటికంటే కాశీ ప్రయాణానికే ఎందుకు ఇంపార్టెన్స్ ఇచ్చారో ఇప్పుడు అర్థమైందామెకి.

భాస్కర్రావ్ కేకకి వంటగదిలోంచి వచ్చిన భవానీ కొడుకు వంకా, భర్త వంకా చూసింది.

తన పరీక్షల గురించి అందరి మధ్యలో దోషిలా నిలబడ్డ సుధీర్‌ని జాలిగా చూసింది పూజిత. అప్పుడే.. సుధీర్ కూడా పూజిత వంక బేలగా చూశాడు. 'ఊహ తెలిసిన ఇన్నేళ్ళలో నాన్న ఏ రోజూ నన్ను కనీసం గసరను కూడా గసరలేదు. పాపం సుధీరన్నయ్యని వాళ్ళ డాడీ ఇంతలా కోప్పడుతున్నారేంటీ..! అయినా నా ఎగ్జామ్స్ కోసమే కదా సుధీరన్నయ్య తిట్లు తింటున్నాడు..' అనుకుంది పూజిత. అలా అనుకోగానే సుధీర్‌కి హెల్ప్ చేయాలనిపించిందామెకి.

వెంటనే భాస్కర్రావ్ వంక చూసింది. కానీ ఆయనలోని కోపాన్ని చూడగానే భయంతో మాటలు రాక గుటకలు మింగింది. ఆ వెంటనే తల తిప్పి, వంటగది గుమ్మం దగ్గరున్న పెద్దమ్మ భవానీ వంక చూస్తూ, "పెద్దమ్మా.. అన్నయ్యని తిట్టొద్దని చెప్పు. సుధీరన్నయ్య కాశీకి రానంటున్నది.. నా పరీక్షలకి నాకు తోడుగా ఉండడం కోసమే కదా. ఈ టూర్‌కి టిక్కెట్స్ బుక్ చేసేటప్పటికి మా ఎగ్జామ్స్ టైంటేబుల్ ఇంకా రాలేదు. పరీక్ష డేట్స్ తెలియగానే నేను కాశీకి రానని నాన్నతో చెప్పాను. కానీ నాన్న.. పరీక్షలు వచ్చే సంవత్సరం వ్రాద్దువులే, పెదనాన్న మాట కాదనకూడదు అన్నారు. ఈ విషయం అన్నయ్యకి చెప్పగానే, నేను టూర్‌కి ఆగిపోయి నీకు తోడుగా ఉంటాలే అన్నాడు.." అని తడబడుతూ చెప్పింది పూజిత.

పూజితని చూస్తూ, ఆమె మాటల్ని వింటూన్న భాస్కర్రావుకి ఆమె ముఖంలో ఏవేవో దృశ్యాలు కనిపిస్తున్నాయి. హిప్నటైజ్ చేయబడ్డవాడిలా శాంతిస్తూ సుధీర్‌వంక చూసి, "ఏంట్రా.. నిజంగా పూజిత పరీక్షల గురించేనా నువ్వు ఆగుతానన్నది.." అనడిగారు భాస్కర్రావ్.

"ఔను డాడీ. చెల్లాయ్ పరీక్షలకి తోడుగా ఉందామని.." అని చెబుతూ తండ్రి కళ్ళలోకి చూసి చెప్పడం ఆపేశాడు సుధీర్.

"పూజితని చూసి నేర్చుకోరా. పరీక్షలు వ్రాయకపోతే ఒక సంవత్సరం వేస్టయిపోతుందని ఎంత

బాధపడిపోతుందో. నువ్వూ ఉన్నావ్ ఎందుకూ.. రేపు పరీక్షంటే ఈ రోజు క్రికెట్ మ్యాచ్ అంటూ రాష్ట్రాలు తిరిగొచ్చావ్. ఇంజనీరింగ్ పూర్తి చేసి రెండేళ్ళైంది. ఉద్యోగం సద్యోగం లేకుండా బలాదూర్ తిరుగుతున్నావ్. అదేమంటే పిచ్చిపిచ్చి బొమ్మలేసుకుని గ్యాలరీలంటూ తిరుగుతావ్.." అంటూ కొడుకు మీద మళ్ళీ అరిచాడు భాస్కర్రావ్.

నిలబెట్టిన తలకాయ్‌ని తోటకూర కాడలా వాల్చేసుకున్నాడు సుధీర్. మ్యాటర్ ఎటు తిరిగి ఎటొచ్చినా పెద్దనాన్న లక్ష్యం అన్నయ్యని తిట్టడమేనేమో.. అని మనసులో అనుకుంది పూజిత.

రెండురోజులు రైలు ప్రయాణంలో తినడానికని చిరుతిళ్ళేవో చేస్తున్న భవానీ.. ఇది రోజూ ఉండే బాగోతమేగా అన్నట్టు.. భర్త కేకల్ని పట్టించుకోకుండా మళ్ళీ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

"సరేలే. మీ ఇద్దరి టిక్కెట్లూ క్యాన్సిల్ చేయిస్తాను. దగ్గరుండి పూజిత చేత పరీక్షలు బాగా వ్రాయించు. అర్థమైందా..?" అని సుధీర్‌తో చెప్పి, పూజిత దగ్గరికి వచ్చాడు భాస్కర్రావ్. "నీకు పరీక్షలున్నాయని చెప్పడానికి నా దగ్గర భయమెందుకమ్మా. ఇన్నాళ్ళూ ఏదో కోపంలో మీకు దూరంగా ఉన్నాం. నీకు మీ నాన్న ఎంతో నేనూ అంతే అనుకో. నీకేం కావాన్నా నాతో చెప్పు.." అని ఎంతో ఆప్యాయంగా అన్నాడు భాస్కర్రావ్.

అలాగేనన్నట్టు తల ఊపింది పూజిత.

'నేను కాశీకి రానంటే బాగా తిట్టి, పూజిత చెప్పగానే మాత్రం అలాగే అంటూ తలూపుతారా..! ఈ డాడీలకి పార్షియాలిటీ బాగా ఎక్కువ. ఒకే పని కొడుకు చేస్తే తిడతారు, కూతురు చేస్తే మెచ్చుకుంటారు. దేవుడా.. అద్దె చెల్లి వచ్చిన ఈ రెండు నెలలకే డాడీలో ఇంత పక్షపాతాన్ని చూస్తే, నాకు నిజంగా స్వంత చెల్లి ఉండుంటే, చిన్నప్పటి నుంచీ ఎంతటి పక్షపాతానికి బలైపోయేవాణ్నో..!? థాంక్ గాడ్.. నాకు చెల్లిని ఇవ్వనందుకు, మా ఇంట్లో నన్నొక్కడినే పుట్టించినందుకు..' అని మనసులోనే దేవుడికి దండాలు పెట్టేసుకున్నాడు సుధీర్.

భాస్కర్రావ్ గారు టిక్కెట్ బుకింగ్ ఏజెంట్‌కి ఫోన్ చేసి.. పూజిత, సుధీర్ టిక్కెట్‌లు క్యాన్సిల్ చేయమని చెప్పారు.

తండ్రి చేత నాలుగు తిట్లు తిన్నా.. గ్యాలరీ ఒకె అవుతున్నందుకూ, తన ఫ్రెండ్ మనోజ్ పెళ్ళికి ఇక్కడే ఉండబోతున్నందుకూ సుధీర్ మనసులో ఆపుకోలేనంత హుషారు బయటకి తన్నుకొస్తోంది. వెంటనే తన గదిలోకి వెళ్ళి పిచ్చిపిచ్చి గంతులు వేయాలనిపించింది సుధీర్‌కి.

కానీ.. అప్పుడే.. భాస్కర్రావ్ గారి సెల్‌ఫోన్ ఘల్లుమంది. "హలో.. ఆ.. మనోజ్... చెప్పు.." అంటున్న తండ్రి మాటలు వినగానే, సుధీర్ మనసు ఘొల్లుమంది.

"నీకు మ్యారేజ్ ఫిక్సైందా..! ఎప్పుడూ.." అని ఆశ్చర్యపోతూ ఆ మరుక్షణమే, "ఓహో.." అంటూ సుధీర్ వైపు తిరిగి చూశాడు భాస్కర్రావ్. ఆయన్నే చూస్తున్న సుధీర్ పాలు తాగుతూ దొరికేసిన పిల్లిలా తలని ఆటోమేటిక్‌గా అటూఇటూ తిప్పి చూస్తున్నాడు.

"ఏదో పనుందని చెప్పాడుగానీ, నీ పెళ్ళని చెప్పలేదులే. ఒకె.." అని ఫోన్ పెట్టేశారు భాస్కర్రావ్. ఆ మాటలకి సుధీర్ ముఖం పాలిపోయింది. వీడు ఇప్పుడెందుకు చేశాడు.. ఛ.. నా ప్లానంతా పాడు చేశాడు.. ఎదవ.. అని మనసులోనే మనోజ్‌ని తిట్టుకున్నాడు సుధీర్.

"మనోజ్ అంటే.. నీకోసం పొద్దుటొచ్చాడు. ఆ రోజు మగరాయుడిలా ఉన్న అమ్మాయిని మనింటికి తీసుకొచ్చాడు.. వాడేగా..? వాడి పెళ్ళన్నమాట. దానికోసం పూజిత పరీక్షల్ని అడ్డు పెట్టావా..? చెబుతా నీ పని.." అంటూ వెంటనే టిక్కెట్ బుకింగ్ ఏజెంట్‌కి మళ్ళీ ఫోన్ చేశాడాయన. "హలో.. వాసుగారూ. ఆ.. ఇందాక చెప్పాను

కదా, ఆ రెండు టిక్కెట్స్‌లో పూజిత టిక్కెట్ ఒక్కటి మాత్రమే క్యాన్సిల్ చెయ్యండి చాలు. సుధీర్ టిక్కెట్ క్యాన్సిల్ చెయ్యకండి.." అన్నాడు భాస్కర్రావ్.

ఆ మాటలు వినగానే, భూమిలోకి జారిపోతున్నట్టనిపించింది సుధీర్‌కి.

"ఏంటీ.. రెండూ క్యాన్సిల్ అయిపోయాయా..!" అన్న ఆయన మాటలకి సుధీర్ ముఖం మళ్ళీ ఆనందంతో వెలిగింది.

"పోనీ.. ఒక పని చెయ్యండి. అదే ట్రైన్‌కి వెయిటింగ్ లిస్ట్ వచ్చినా పర్వాలేదు. ఒక టిక్కెట్ మాత్రం అర్జెంట్‌గా బుక్ చేసేయండిప్పుడు.." అని కసిగా చెప్పాడు భాస్కర్రావ్.

సుధీర్ ముఖం మళ్ళీ మాడిపోయింది. తండ్రి మాటలకి తగ్గట్టుగా అతని ముఖంలోని కాంతి లోవోల్టేజ్‌తో కొట్టుకునే ట్యూబ్‌లైట్‌లా వెలిగి ఆరుతోంది.

పూజిత రెప్పవాల్చకుండా సుధీర్ వంకే గుర్రుగా చూస్తోంది. 'అంటే.. ఫ్రెండు పెళ్ళికి వెళ్ళడం కోసం నా పరీక్షలని అడ్డు పెట్టుకున్నాడా..! పొద్దున్న కాలేజ్‌లో పరీక్షలని చెప్పగానే నవ్వుతున్నాడేంటా.. అనుకున్నాను. ఇందుకన్నమాట. మరి పెదనాన్న తిడుతున్నారంటే.. ఇలా ఉంటే తిట్టరా..' అనుకుంది.

"సరే. నేను పది నిముషాల్లో మళ్ళీ ఫోన్ చేస్తాను. ఉంటాను.." అని ఫోన్ కట్ చేసి, సుధీర్ వంక చూశాడు భాస్కర్రావ్.

పరీక్షా ఫలితాల కోసం ఎదురుచూస్తున్న పిల్లాడి చేతికి.. రిజల్ట్స్‌పేపర్ చిక్కినా, పాసో ఫెయిలో ఇంకా అర్థంకానివాడిలా.. బిక్కమొహం పెట్టి అయోమయంగా తండ్రివంక చూస్తున్నాడు సుధీర్.

సెల్‌ఫోన్ జేబులో వేసుకుంటూ, "ఏంట్రా ఇంకా గుడ్లప్పగించి నిలబడ్డావ్..? వెళ్ళు. వెళ్ళి బట్టలన్నీ సరిగ్గా సర్దుకున్నావో లేదో చూసుకో.." అని సీరియస్‌గా అన్నాడు భాస్కర్రావ్.

ఇప్పుడు వెనక్కి తగ్గామా డేంజర్‌లో పడిపోతాం, ఇదే ఆఖరి అవకాశం.. అన్నట్టు తండ్రి వంక చూశాడు సుధీర్. "డాడీ.. మనోజ్ పెళ్ళి గురించి నాకు ముందే తెలుసు. అయినా వాడి పెళ్ళి కంటే కాశీ ప్రయాణానికే ఎక్కువ ప్రయారిటీ ఇచ్చాను. కానీ.. పూజితకి ఫైనలియర్ ఎగ్జామ్స్ అని ఈ రోజే తెలిసింది. పరీక్షలు విలువ నాకంటే మీకే ఎక్కువ తెలుసు. తన కష్టమంతా వేస్ట్ అవుతుంది కదా. అందుకే చెల్లికి తోడుగా ఉన్నట్టు ఉంటుంది, ఏదో వాడి పెళ్ళికూడా చూడొచ్చులే అనుకున్నాను.." అని సమర్థించుకుంటున్నట్టుగా చెప్పాడు.

సుధీర్ పరీక్షల విలువ గురించి మాట్లాడేసరికి భాస్కర్రావుకి పౌరుషం వచ్చింది. వెంటనే, "ఏం చెయ్యాలో, ఏం చెయ్యకూడదో నాకు తెలుసులేవోయ్. నువ్వెళ్ళి బట్టలు సర్దుకో.." అని ఏ మాత్రం తగ్గకుండా అరిచాడాయన.

ఆయన గురించి బాగా తెలుసు సుధీర్‌కి. అందుకే మౌనంగా తన గది వైపు నడిచాడు.

సుధీర్ మాటలు విని పాపం.. సుధీర్ మంచివాడే, నా పరీక్ష గురించి ఎంత టెన్షన్ పడుతున్నాడో.. అని అమాయకంగా అనుకుంది పూజిత. ఆమె నోరుతెరిచి భాస్కర్రావుతో ఏదో చెప్పబోతుంటే, ఆయన సెల్‌ఫోన్ మోగింది.

"హలో.. ఆ వాసుగారూ.. చెప్పండి.." అన్నాడాయన. అక్కడే ఉన్న పూజితతో పాటూ, తన గది తలుపు ముందు నిలబడ్డ సుధీర్ కూడా చెవులు రిక్కించి వింటున్నాడు.

"ఓహో.. అలాగా. పర్లేదులెండి. దానికి మీరేం చేస్తారు. అందులోనూ శివరాత్రి టైం కదా. సరే అయితే. ఉంటాను.." అని ఫోన్ కట్ చేశాడు భాస్కర్రావ్. తనవంకే చూస్తున్న పూజిత దగ్గరకి వెళ్ళి, "నీకు సుధీరన్నయ్య తోడుంటాడులేమ్మా. నువ్వేం అధైర్యపడకు.." అని చెప్తూ ఆమె తల మీద చెయ్యవేసి నిమిరాడు భాస్కర్రావ్.

అంతే.. ఆ మాటలు వినబడగానే.. తన గదిలోకి వెళ్ళి తలుపు లోపల గడిపెట్టి, ఇష్టమొచ్చినట్టుగా చిందులు వెయ్యసాగాడు సుధీర్.

"థ్యాంక్యూ పెదనాన్నా.." అని సంతోషంగా అంది పూజిత.

"పరీక్షలు బాగా వ్రాయమ్మా.." అని ఆప్యాయంగా అన్నాడు భాస్కర్రావ్.

నవ్వి తలూపింది పూజిత. అప్పుడే రెండు చేతుల్లో లగేజీ పట్టుకుని ఇంట్లోకి వచ్చాడు పూజిత తండ్రి రాఘవ. తండ్రిని చూసి ఎదురు వెళ్ళిందామె. భాస్కర్రావ్ కూడా ఎదురెళ్ళి, "రా.. రాఘవా. రా.." అంటూ రాఘవ చేతిలోని లగేజీ తీసుకోబోయాడు.

"పర్వాలేదు అన్నయ్యా. కాసేపట్లో తీసుకెళ్ళాల్సినవేగా. ఇక్కడుంచుతాను.." అని బ్యాగుల్ని హాల్లోనే ఓ పక్కన పెట్టాడు.

పూజిత పరీక్షల కోసం.. సుధీర్, పూజిత ట్రైన్ టిక్కెట్లను క్యాన్సిల్ చేయించి, వాళ్ళని ఇక్కడే ఉంచుతున్నట్టు తోడల్లుడు రాఘవతో చెప్పాడు భాస్కర్రావ్. మాట్లాడుతూనే ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్నారు వాళ్ళు.

సాయంత్రమవుతుంటే, ఒక్కొక్కరుగా స్నానాలు చేసి ఫ్రెష్ అవుతున్నారు.

సుధీర్ మనోజ్‌కి ఫోన్ చేసి.. జరిగినదాన్నంతా చెబుతూ, నువ్వు ఫోన్ చేసి నీ పెళ్ళని చెప్పడం వల్లే మా డాడీతో తిట్లు తిన్నానంటూ, మాట్లాడే మాటమాటకీ మనోజ్‌ని తిడుతున్నాడు.

పూజిత హాల్లో కూర్చుని, ఇంటికొచ్చిన మిత్రురాళ్ళతో తన ప్రయాణం క్యాన్సిలైందంటూ, తాను ఎగ్జామ్స్ వ్రాయబోతున్నానన్న విషయాన్ని సంతోషంగా చెప్తోంది.

ఆ ఇంట్లో.. అంతా ఎవరి హడావుడిలో వారున్నారు.

* * *

రాత్రి పది గంటలప్పుడు.. అందరూ టాక్సీలో రైల్వే స్టేషనుకి బయల్దేరారు.

దార్లో భాస్కర్రావు సుధీర్‌ని అలా ఉండు, ఇలా ఉండు, అది చేయొద్దు, ఇది చేయొద్దు,.. అంటూ హెచ్చరిస్తూనే ఉన్నాడు. భవానీ మాత్రం మధ్యమధ్యలో భర్తని వారిస్తూ సుధీర్‌కీ, పూజితకీ తన ధోరణిలో తాను జాగ్రత్తలు చెబుతోంది.

తల్లి, తండ్రి ఎవరు మాట్లాడుతుంటే వారివంక చూస్తూ వాళ్ళు చెప్పిన అన్నిటికీ కొండపల్లి బొమ్మలా తల ఆడిస్తున్నాడు సుధీర్.

రైల్వే స్టేషన్‌లోకి వెళ్ళాక వారణాసి వెళ్ళే గంగాకావేరీ ఎక్స్‌ప్రెస్ ఏ ప్లాట్ ఫాంలోకి వస్తుందో ఎంక్వైరీలో కనుక్కుని, తనకీ పూజితకీ ప్లాట్‌ఫాం టిక్కెట్లు తీసుకున్నాడు సుధీర్. తరువాత తండ్రి చేతిలోని లగేజీ అందుకుని, ట్రైన్ పదవ నెంబరు ప్లాట్‌ఫాం మీదకు వస్తుందని చెప్పాడు. అందరూ వాళ్ళవాళ్ళ లగేజీతో పదో నెంబరు ప్లాట్‌ఫాం మీదకి చేరుకున్నారు.

ట్రైన్ వచ్చేవరకూ స్టేషన్‌లోనే ఉంటానన్నాడు సుధీర్. కానీ భాస్కర్రావు ఊరుకోలేదు. "రైలు పన్నెండున్నరకి వస్తుంది. అర్ధరాత్రి ఒంటిగంటప్పుడు ఆడపిల్లని రోడ్లమ్మట తిప్పుతావా..? నువ్వు మమ్మల్ని ట్రైన్ ఎక్కించకపోతే మేము ఎక్కలేమా. ముందు ఇంటికి బయల్దేరు. చెల్లిని జాగ్రత్తగా చూసుకో. మేం లేము కదా అని ఎదవ తిరుగుళ్ళు తిరుగుతూ, కోతివేషాలు వెయ్యకు.." అని గదమాయిస్తూ అన్నాడాయన.

అలాగేనన్నట్టుగా మౌనంగా తలూపి పూజిత వంక చూశాడు సుధీర్.

"పెద్దమ్మా హ్యాపీజర్నీ. హ్యాపీజర్నీ పెదనాన్నా.." అని ఇద్దరికీ చెప్పి, తండ్రి చేతిని తన చేతిలోకి తీసుకుంది పూజిత. "జాగ్రత్త నాన్నా. టైముకి టాబ్లెట్స్ వేసుకో. మర్చిపోకు. ట్రైన్ బయల్దేరగానే ఫోన్ చెయ్యి.." అని రాఘవతో అంది.

"అలాగేరా తల్లీ. నువ్వు జాగ్రత్తగా ఉండు. ఏది కావాలన్నా సుధీరన్నయ్యని అడుగు. లేదంటే నాకు ఫోన్ చెయ్యి. దేనికీ ఇబ్బంది పడకు.." అని చెబుతుంటే రాఘవ గొంతు బొంగురుపోయింది.

ఆ తండ్రీ కూతుళ్ళని రెప్పవాల్చక చూస్తున్నారు భవానీ, భాస్కర్రావు. తమంత ఎదిగిన పూజిత కొత్తగా కనిపిస్తోంది వాళ్ళ కళ్ళకి. పూజితని చూస్తుంటే.. తన చెల్లి గుర్తుకొచ్చి భవానీ ఆలోచనలు అల్లకల్లోలమయ్యాయి.

భాస్కర్రావుకి ఇన్నాళ్ళూ మరదలి మీద జాలి ఉండేది. ఇప్పుడు దాని స్థానంలో కోపం చేరుతోంది. పరిస్థితులకి తగ్గట్టు నడుచుకోక, పిచ్చి పంతాలకు పోయి బంగారంలాంటి కూతుర్నీ, భర్తనీ వదిలేసుకుని మూర్ఖంగా చచ్చిపోయింది, నింద వీళ్ళ మీద పడేసింది.. అని బాధపడ్డాడాయన.

మళ్ళొకసారి అందరికీ బై చెప్పి ప్లాట్‌ఫాం నుంచి వెనుదిరిగారు సుధీర్, పూజితలు.

రైల్వే స్టేషన్ నుంచి బయటకు రాగానే ఆటోస్టాండ్‌లోని ఆటోని పిలిచి, "కరెన్సీ నగర్.." అన్నాడు సుధీర్.

"కరెన్సీనగరా.. మన ఇల్లు గవర్నర్‌పేటలో కదా.." అని అయోమయంగా అంది పూజిత.

"మనం వెళ్ళేది ఇంటికి కాదులే. మా ఫ్రెండు పెళ్ళని చెప్పాను కదా. వాడింటికి.." అని ఆటో ఎక్కబోయాడు సుధీర్.

అతని ధోరణికి విస్తుపోతూనే, "అదేంటి..? ఎవరో తెలీని వాళ్ళింటికి నేనెలా వస్తాను..? మీ ఇంటికే వెళదాం. లేదంటే చెప్పు, నేను మా ఇంటికి వెళ్ళిపోతాను.." అని నిక్కచ్చిగా అంది పూజిత.

"ఇప్పుడు ఇంటికి వెళ్ళి ఏం చేస్తాం చెప్పు..? బోర్ బోర్. రేపు మార్నింగ్ వాణ్ని పెళ్ళికొడుకుని చేస్తున్నారు. ఈ పాటికే మా ఫ్రెండ్సందరూ అక్కడకు వచ్చేసుంటారు. ఇంట్లో ఏం బావుంటుంది. అక్కడైతే చాలా సందడిగా ఉంటుంది.." అని సర్దిచెప్పబోయాడు సుధీర్.

"సరే. నువ్వు మీ ఫ్రెండ్ ఇంటికి వెళ్ళు. నేను స్టేషన్ లోపలకు వెళ్ళి పెదనాన్నాళ్ళని ట్రైన్ ఎక్కించి మా ఇంటికి వెళతాలే.." అని బెదిరిస్తున్నట్టుగా వెనక్కు తిరిగింది పూజిత.

సుధీర్ ఇక ఏం చెయ్యలేక ఖర్మరా బాబూ.. అని మనసులో అనుకుని, "రా.. ఇంటికే వెళదాంలే.." అని చిరాకుగా అన్నాడు.

వస్తున్న నవ్వుని పెదవుల్లోపలే నొక్కి పట్టుకుని, పైకి మాత్రం సీరియస్‌గా మొహం పెట్టి ఆటోలో కూర్చుంది పూజిత. గవర్నరు పేటలోని తమ ఇంటి అడ్రసు చెప్పి, తనూ సీరియస్సుగా ఎక్కి కూర్చున్నాడు సుధీర్. వాళ్ళెక్కిన ఆటో రయ్యిన బయల్దేరింది.

* * *

ఉదయం తొమ్మిది గంటలవుతోంది సమయం.

సుధీర్ ఎప్పుడో రెడీ అయ్యి సోఫాలో కూర్చునున్నాడు. అతనికెదురుగా పూజిత నిద్రపోతున్న గది ఉంది. ఆమె ఎప్పుడు తలుపు తీస్తుందా.. అని ఆత్రంగా దాని వంకే చూస్తున్నాడు సుధీర్. చీకటితో అయిదు గంటలకే నిద్ర లేచి, స్నానం చేసి తయారై హుషారుగా మనోజ్ వాళ్ళ ఇంటికి వెళదామని అనుకున్నంతలో తండ్రి భాస్కర్రావు గారి నుంచి ఫోన్ వచ్చింది.

సుధీర్‌తో మాట్లాడిన తర్వాత ఫోన్ పూజితకి ఇవ్వమన్నారాయన. పూజిత ఇంకా నిద్ర లేవలేదని

చెప్పగానే, ఆమె లేచిన తర్వాత నీ ఫోన్ నుంచీ పూజితతో మాట్లాడించు అన్నారు భాస్కర్రావ్. అందుకే.. పూజిత ఎప్పుడు నిద్ర లేస్తుందా.. అని ఉసూరంటూ ఆమె గది తలుపుకెదురుగా కూర్చుని, మధ్య మధ్యలో గోడగడియారం వంక విసుగ్గా చూస్తున్నాడు సుధీర్.

మరో అరగంటకి డోర్ తీసింది పూజిత. చిత్రంగా ఆమె ముఖంలో నిద్రబద్ధకం లేదు. తలస్నానం చేసి అందంగా ముస్తాబై ఉంది. నమ్మలేనట్టుగా నొసలు ముడిచి పూజిత వంక చూస్తూ, "నువ్వు ఎప్పుడో నిద్ర లేచావా..?" అని గబగబా అడిగాడు సుధీర్.

"ఔను. మా ఫ్రెండ్‌తో ఈ టైంకి వస్తానని చెప్పాను.." అంటూ చేతి వాచ్‌వంక చూసుకుందామె.

ఆమె మాటలకి బుస్సున కోపం పొంగింది సుధీర్‌లో. "ఛా..! భలే గొప్పదానివి తల్లీ నువ్వు. నేనేమో.. ఇంకా నువ్వు నిద్ర లేవలేదనుకుని వెయిటింగ్ ఇక్కడ. నువ్వేమో ఎప్పుడో నిద్రలేసి, లోపల మేకప్పులేసుకుంటున్నావా..!?" అని ఉడుక్కుంటున్నట్టుగా అడిగాడు.

"నాకోసం వెయిటింగెందుకు..?" అని సీరియస్‌గా అడిగింది పూజిత.

"డాడీ ఫోన్ చేశారు. నీతో మాట్లాడతారట.." అంటూ తన జేబులోంచి ఫోన్ తీసి తండ్రికి ఫోన్ చేశాడు సుధీర్. అవతల రింగ్ అవగానే, ఫోన్‌ని పూజితకు ఇచ్చాడతను.

"హలో పెదనాన్నా.. బావున్నాను. మీరెక్కడున్నారు..? ఆహా. రేపు ఉదయానికి దిగుతారా. ఓకే. త్రివేణీ సంగమంలో స్నానం చేసి.. వారణాసికి వెళతారా. ఊ.. సరే.. నేను కంబైన్డ్ స్టడీ కోసం మా ఫ్రెండింటికి వెళ్తున్నాను. మధ్యాహ్నం భోజనం అక్కడే చేస్తాను. ఊ. సుధీరన్నయ్య డ్రాప్ చేస్తానన్నాడు. ఆ.. ఉంటాను. అలాగే.." అని ఫోన్ కట్ చేసి సుధీర్ వైపు తిరిగింది పూజిత.

అప్పటికే ఆమె వంక గుర్రుగా చూస్తున్నాడు సుధీర్. పూజిత తన వైపు చూడగానే, "నేను డ్రాప్ చేస్తానన్నానా..? ఎప్పుడన్నానమ్మా..? నన్ను ఇలా బుక్ చేస్తున్నావేంటీ..!" అని వ్యంగ్యంగా అంటూ ఫోన్ తీసుకున్నాడు సుధీర్.

"నీ ఫ్రెండ్ పెళ్ళికోసం.. పెదనాన్నతో నా ఎగ్జామ్స్ అని చెప్పి, నన్ను బుక్ చెయ్యలేదా..? ఇదీ అంతే.." అని మాటకు మాట బదులు చెప్పింది పూజిత.

"నీకు ఎగ్జామ్స్ ఉన్నాయి. అది నేను చెప్పిన అబద్ధం కాదుగా.." అని కుళ్ళిపోతూ అన్నాడతను.

"ఉన్నాయి. కానీ నీ ప్రయారిటీ నా పరీక్ష మీద కాదు, నీ ఫ్రెండు పెళ్ళి మీద. నాకు తెలుసులే. రాత్రే అర్థమైంది నాకు. అయినా రాత్రి కనీసం నన్ను అడక్కుండా నీ ఫ్రెండు ఇంటికి ఆటో మాట్లాడేస్తున్నావ్. నేను ముఖం వాష్ చేసుకోలేదు, మంచి డ్రెస్ వేసుకోలేదు. ఎలా వస్తాను..? ఆ కొత్త ప్లేసులో ఎలా ఎడ్జస్టవుతాను..?" అని దబాయిస్తూ గట్టిగా అడిగింది పూజిత.

కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా పూజిత వంక చూశాడు సుధీర్. "రాత్రి నువ్వు రానన్నది.. బాగా తయారై లేవనా..! గొప్పదానివి తల్లీ. ఆ కొత్త ప్లేసులో ఎలా ఎడ్జస్టవుతానూ అంటున్నావ్.. మరి ఈ కొత్త ప్లేసులో ఎలా ఎడ్జస్టయ్యావ్..?" అని వెటకారంగా అడిగాడు సుధీర్.

"ఏంటీ డైలాగా..? ఇది మా పెద్దమ్మ ఇల్లు. ఇక్కడ నాకు కొత్తేంటి.." అందామె ధీమాగా.

"నీకు కొత్తేం ఉండదులే. ఉంటే గింటే మాకుండాలి.." అని గుమ్మం వైపు నడిచాడు సుధీర్.

బయటకు వెళుతున్న సుధీర్‌ని చూసి, "ఎక్కడకి వెళ్ళిపోతున్నావ్..? ముందు నన్ను మా ఫ్రెండ్ ఇంట్లో దించు.." అని గట్టిగా అరిచింది పూజిత.

"మీ ఫ్రెండ్ ఇంటికి అని ఇప్పుడు అడుగుతున్నావ్. మా ఫ్రెండ్ ఇంటికి వెళదామని నేను రాత్రే అడిగాను. అప్పుడేమన్నావ్..?" అని వెక్కిరిస్తూ, ముందుకు అడుగేశాడు సుధీర్.

"సరే వెళ్ళు. నేను పెదనాన్నకి ఫోన్ చేసి, సుధీరన్నయ్య నన్ను డ్రాప్ చెయ్యకుండా ఊరు మీద బలాదూర్ తిరగడానికి వెళ్ళాడని చెబుతాను.." అని కసిగా అంటూ పర్సు తీసింది పూజిత.

అంతే.. గిర్రున వెనక్కి తిరుగుతూ, "తల్లీ.. నీకో దణ్ణం. రా చెల్లీ.. వెళదాం.." అంటూ రెండు చేతులూ జోడించాడు సుధీర్.

"థ్యాంక్స్.. పద.." అని నవ్వుతూ బయటకు నడిచిందామె.

ఇంటికి తాళం వేసి, బైక్ స్టార్ట్ చేశాడు సుధీర్. "గాంధీ నగర్‌లో ఉంది మా ఫ్రెండ్ ఇల్లు.." అని చెప్పి బండెక్కి కూర్చుందామె. బయల్దేరిన అయిదు నిముషాలకి గానీ అర్థంకాలేదు పూజితకి బండి వెళ్ళేది గాంధీనగర్‌కి కాదు, దానికి వ్యతిరేక దిశలో అని.

"ఓయ్ సుధీర్.. ఎక్కడకి వెళుతున్నాం మనం..?" అని కంగారుగా అడిగింది పూజిత.

"సుధీర్ కాదు.. నేను నీకంటే పెద్దవాణ్ని. అన్నయ్యా.. సుధీరన్నయ్యా అను. మనం వెళ్ళేది గాంధీ నగర్‌కి కాదు, కరెన్సీ నగర్‌కి. మా ఫ్రెండ్‌ని కలిశాకే, నిన్ను మీ ఫ్రెండు ఇంటికి తీసుకెళతాను.." అని సీరియస్‌గా అంటూ బైక్ వేగాన్ని పెంచాడు సుధీర్.

"యూ స్టుపిడ్.. అందుకే పెదనాన్న రోజూ నిన్ను అన్నేసి తిట్లు తిడుతున్నాడు.." అని కచ్చగా పళ్ళు కొరుకుతూ అందామె.

"ఓయబ్బో.. మీ నాన్న నిన్నెప్పుడూ తిట్టలేదు మరి.." అని వెక్కిరించాడు సుధీర్.

"మా నాన్న నన్నెప్పుడూ తిట్టలేదు.." అని గర్వంగా అందామె.

"అందుకే ఇలా తయారయ్యావ్. కూర్చుంటే సైలెంట్‌గా కూర్చో. లేదంటే ఇక్కడే దింపేస్తాను.." అని బెదిరించాడు సుధీర్.

క్రాంతీ వాళ్ళింటికి వెళ్ళాలంటే గాంధీనగర్ నుంచి లోపలకి వెళ్ళాలి. అటు బస్‌రూట్ కూడా లేదు. కనీసం షేరింగ్ ఆటోలూ ఉండవు. దానికంటే ఒక గంట ఆలశ్యమైనా సుధీర్‌తో పాటూ వాళ్ళ ఫ్రెండ్ ఇంటికి వెళ్ళి, అటు నుంచి క్రాంతి దగ్గరకి వెళ్ళడమే మంచిది.. అనుకుని మౌనంగా కూర్చుంది పూజిత. మరో అరగంటకి మనోజ్ ఇంటి ముందు ఆగింది సుధీర్ బైక్.

ఇంట్లోకి వస్తున్న సుధీర్‌ని చూడగానే, "హాయ్‌రా సుధీర్..! రారా. థ్యాంక్యూ సో మచ్‌రా. నీ కోసమే చూస్తున్నా. అందరూ వచ్చినా నువ్వు రాకపోతే ఏదో మిస్సయినట్టుందిరా.." అని పట్టలేనంత ఆనందంతో ఎదురెళ్ళి సుధీర్‌ని హత్తుకుపోయాడు మనోజ్.

భారీ అంకరణతో ఉన్న ఆ డూప్లెక్స్ ఇంటిని గమనించి చూస్తూ, మొహమాటంగా గుమ్మం దగ్గరే ఆగిపోయింది పూజిత.

"ఏంట్రా లేటయ్యింది..? పెళ్ళికొడుకుని చేసేశారు తెలుసా. ఎర్లీ మార్నింగ్ వచ్చేస్తావను కున్నాను.." అని సుధీర్ భుజం చుట్టూ చెయ్యేసి అన్నాడు మనోజ్. ఆ మాటలకి వెంటనే పూజిత గుర్తొచ్చి, వెనక్కి తిరిగి చూశాడు సుధీర్.

గుమ్మం దగ్గరే నిలబడిన పూజిత సుధీర్ వంకా, మనోజ్ వంకా చూస్తోంది.

సరిగ్గా అప్పుడే.. మనోజ్ కూడా పూజితని చూశాడు. అంతే.. కొన్ని సెకన్లు అతనికి కనురెప్ప పడలేదు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Atram+Pellikoduku**

* * *